# 1

## మతశాఖ కాని క్రైస్తవ్యం:

# పరిచయం

శాఖల విభజన లేని క్రైస్తవ్యమంటే నిజంగా నేడు లోకానికి ఏమీ తెలియదు. ఒక వ్యక్తి కేవలం క్రైస్తవుడుగానే ఉండగలడనే భావనను అంగీకరించడం అనేకులకు కష్టంగా ఉంటుంది. తాను క్రైస్తవుడనని ఒకడు చెప్పుకోగానే, "నీవు ఏ మతశాఖకు చెందినవాడవు?" అనే ప్రశ్న తప్పనిసరిగా వస్తుంది. ఒకడు ఏ మతశాఖకు చెందకుండ కేవలం క్రైస్తవుడుగానే ఉండగలడు అనే భావనను కాదనడం జరుగుతుంది. నేను క్రైస్తవుడను ఏ మతశాఖకు చెందినవాడను కాను అని చెప్పుకొంటే, ఏదో ఒక మతశాఖ పేరు అతనికి తగిలిస్తారు.

ఏ మతశాఖలతోనూ తమకు సంబంధంలేదని వారు చెప్పుకొంటూ, ఒక పది మంది క్రైస్తవులు విశ్వాసులుగా కలసి పని చేస్తూ, ఆరాధించ నారంభించారే అనుకో, వారు క్రైస్తవులు, క్రైస్తవులు మాత్రమేనని, క్రీస్తు ప్రభువు స్థాపించిన సంఘంలో సభ్యులం – అంతేనని వారు చెప్పుకున్నా, ఏ విధమైన పరిశీలన లేకుండా, అనుకోకుండానే వారిని కూడా ఒక మతశాఖగా ముద్రిస్తారు.[1]

క్రైస్తవులు కేవలం క్రైస్తవులుగాను, సంఘమంటే – కేవలం క్రీస్తు సంఘంగాను ఉండడం అసాధ్యమైనట్టు అనేకులు ఆలోచిస్తారు. మనుష్యులు దేవుని ఆత్మతో మాట్లాడిన తొలి దినాల్లో, యెరూషలేము సంఘానికి ఉన్న ఘనతను ప్రత్యేకతను ఎవరును కాదనలేరని నేను ఊహించుతున్నాను. ఆ స్థానిక సంఘం యొక్క ఆరంభ కాలపు పని, దాని నిర్వహణ అనేవాటి చరిత్ర అపొస్తులుల కార్యముల తొలి ఏడు అధ్యాయాలలో యివ్వబడింది. దీనితో వేలకొలది మంది సభ్యులున్నారు, అయినా ఆ విశ్వాసులందరు కేవలం క్రైస్తవులు మాత్రమే. వారిలో ఎవడును క్రీస్తు శిష్యుడు అనే దానికంటె తనను తాను ఎక్కువగా చెప్పుకోలేదు. ప్రతి వ్యక్తియు రక్షింపబడినవాడై, ప్రభువుచే సంఘానికి చేర్చబడ్డాడు – ఏ సంఘానికి? ఆ క్రైస్తవులందరు ఏ మతశాఖకు చెందినవారైయున్నారు? వారు చెందియుండగలగడానికి ఆనాడు భూలోకమంతటిలో ఏ మతశాఖయు లేదు.

యెరూషలేములో వేలమంది ప్రజలు క్రీస్తు శిష్యులైయుండి, రక్షింపబడినవారై – సంఘంతో చేర్చబడి – వారిలో ఎవరును ఏ మతశాఖకు చెందియుండక – "సంఘానికి" మాత్రమే చెందినవారై ఉన్నట్టయితే – నేడు అదేవిధంగా వేలాదిమంది జనులు ఎందుకు ఉండకూడదు? అలా కేవలం క్రైస్తవులు, శిష్యులు రక్షింపబడిన జనులు అనబడే ఆధిక్యతను నేడు ఎందుకు కాదంటున్నారు? వారు రక్షింపబడినవారై, క్రైస్తవ జీవితాన్ని జీవించుతూ, కేవలం శిష్యులుగాను, "సంఘ" సభ్యులుగాను దేవుని ఆరాధించుతూ పని చేయగలిగి ఉండినట్టయితే, అలా నేను ఎందుకు చేయకూడదు? అలా చేయకుండ నన్ను

ఆటంకపరిచేది ఏది? ప్రభువైన యేసు యొక్క అపొస్తలులచేత నడిపింపబడి "సంఘం"తో చేర్చబడినవారై యున్నట్టయితే, కేవలం వారివలె మనం ఉండడం సంపూర్ణంగా క్షేమకరం కాదా? వాస్తవానికి, దైవ ప్రేరేపితులైన అపొస్తలులయందును ఆత్మ యొక్క పరిశుద్ధమైన మాదిరిని అలక్ష్యం చేయడం ఎంతో భయంకరము కాదా? "దేవుని ఆత్మచేత ఎందరు నడిపింప బడుదురో, వారందరు దేవుని కూమారులైయుందురు" (రోమా 8:14).[2]

పూర్వ శిష్యుల యొక్క మాదిరిని అనుసరించకపోవడం, తప్పిపోవడం, దేవుని ఆత్మ యొక్క నడిపింపును వెంబడించడంలో తప్పిపోవడమే, మరియు దేవుని ఆత్మాను సారమైన నడిపింపును స్వీకరించకపోవడం, విధేయులైన దేవుని పిల్లలుగా ఉండుటలో తప్పిపోవడమే ఔతుంది. దేవునికి నమ్మకమైన సంతానంగా ఉండడానికి ఒకే మార్గం, బహిరంగంగా పరిశుద్ధాత్మను అనుసరించడమే; పరిశుద్ధాత్మను వెంబడించడమంటే – రక్షింపబడ్డాం గనుక, ఏ మత శాఖకు చెందక, కేవలం శిష్యులంగానే, కేవలం క్రైస్తవులుగా మాత్రమే, రక్షింపబడి, ఆయన సంఘానికి చేర్చబడ్డాం.

దైవ ప్రేరేపితులగు ఆయన అపొస్తలులు ప్రవక్తల ద్వారా లోకానికి యివ్వబడిన ప్రభువు మతం మనకు సరిపోదా? అది చాలినంత పవిత్రమైనది కాదా? దానిని మెరుగుపరచే ధైర్యం మనకుందా?

మన ప్రభువు యొక్క క్రొత్త నిబంధనను ఒకడు తీసికొని, నమ్మకంగా పఠించి, అందలి క్రీస్తుకు హృదయపూర్వకంగా తనను తాను లోబరచుకొంటూ, ఈ ప్రభువు ఆజ్ఞలకు అతడు హృదయపూర్వకంగా లోబడ్డాడని అనుకుందాం. క్రొత్త నిబంధనలో క్రీస్తు ఏమి బోధిస్తున్నాడో దాన్ని చేయుటయందు స్థిరంగా అతడు ప్రయాసపడుతూ – క్రీస్తు తనను నడిపించేదానికి భిన్నంగా ఉండనతడు నిరాకరించినట్లయితే అతడేవిధంగా రూపొందుతాడు, అతడేమైయుంటాడు? అతడు తప్పక క్రీస్తు యొక్క శిష్యుడైయుంటాడు, అతడు తప్పక రక్షణను కనుగొంటాడు, తప్పక అతడు "సంఘానికి" చేర్చబడినవాడై ఉంటాడు. వాస్తవానికి, అతడు యెరూషలేమునందలి ఆనాటి శిష్యులను పోలి ఉంటాడు.

ఆలాటి ఒక వంద మంది ఒక ఊరిలో ఉన్నారనుకుందాం. దేవుని ఆరాధించడానికి వారు సంఘంగా నేడు కూడివచ్చి, యేసును తప్ప మరి ఏ ప్రభువును ఎరుగక – ప్రభువు తమ్మును ఏ సంఘానికి చేర్చాడో ఆ సంఘానికి తప్ప మరి దేనికిని చెందక ఉన్నట్టయితే, ఆ వంద మంది శిష్యులు ఏ సంఘంగా రూపించబడతారు? వారు ఏ మతశాఖకు చెందుతారు? ఏ శాఖకూ చెందరు; వారు క్రీస్తుచే స్థాపింపబడిన సంఘానికి మాత్రమే చెందినవారని చెప్పవచ్చు.

---

సూచనలు

[1]ఎడిటర్ నోట్‌ను చూడు. [2]లేఖనాలు వేరుగా చెప్పబడక పోయినట్టయితే, ప్రతిదీ తెలుగు తర్జుమాలోనుండి తీయబడినదే.